• స్వామియే శరణం



- విజయవాడ రైల్వేస్టేషన్‌లో అయ్యప్పల సందడి
- ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి భారీగా రాక
- శ్రీకాకుళం, విజయనగరం నుంచి వందల సంఖ్యలో..
- తిరిగి ఇక్కడి నుంచి ప్రత్యేక రైళ్లలో శబరిమలకు..
- రైల్వేస్టేషన్‌లోనే అయ్యప్పల స్నానాలు.. పూజలు
- దుర్గమ్మ దర్శనానికి పోటెత్తుతున్న స్వాములు

6లో



జేసీ గీతాంజలిశర్మ ఆధ్వర్యంలో ముడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మట్టా ప్రసాద్. చిత్రంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, కామినేని శ్రీనివాస్ తదితరులు

జిల్లా అభివృద్ధిలో ముడాదే కీలకపాత్ర

- అభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడాలి
- పెడన కలంకారీ వృద్ధికి సహకరించాలి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- ముడా ఛైర్మన్‌గా మట్టా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

6

ధాన్యంలో తేమశాతాన్ని పెంచి కొంటాం

17 నుంచి 24 శాతానికి వెసులుబాటు కలిగిస్తాం

- రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది
- గుడ్లవల్లేరులో మంత్రి నాదెండ్ల పర్యటన

గుడ్లవల్లేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ధాన్యంలో తేమశాతాన్ని 17 నుంచి 24 వరకు వెసులుబాటు కలిగించి, రైతు సేవా కేంద్రాల ద్వారా కొంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. రైతు పండించిన ధాన్యంలో ప్రతి గింజా కొంటామని, దళారుల చేతుల్లో మోసపోవద్దని భరోసా ఇచ్చారు. గుడ్లవల్లేరులో కోత కోసిన ధాన్యం రాశులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత గుడ్లవల్లేరు లయన్స్ సేవాభవన్‌లో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. 'గతంలో మాదిరిగా మేము చెప్పిన మిల్లుకే ధాన్యం తోలాలి.. అనే నిబంధనను తొలగించి.. తాను ఎక్కడ ధాన్యం అమ్ముకోవాలో రైతే నిర్ణయిస్తాడు. అదే తుది నిర్ణయం.' అని పేర్కొన్నారు. తొలుత గుడ్లవల్లేరులో వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి పొలంలో పండిన ధాన్యపు రాశులను మంత్రి పరిశీలించారు. అక్కడ పలువురు రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించారు. గన్నీ బ్యాగులు సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పారు. రైతు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్తే అధికారులు తేమశాతాన్ని పరిశీలించి, ధర నిర్ణయించి మిల్లుకు రాసి పంపాలని, కానీ ఇక్కడ మాత్రం ధరను మిల్లర్లు నిర్ణయించి, రైతును మిల్లుకు పంపుతున్నారని తెలిపారు. రవాణా లారీలు కానీ, ట్రాక్టర్లు కానీ అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి స్పందిస్తూ.. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఏ స్థాయిలో తప్పులు జరిగినా ఉపేక్షించబోమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్ ఛైర్మన్ మరెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు

ఆ 8 మందికి రెండు రోజుల పోలీస్ కస్టడీ

- టీడీపీ నేత రంగబాబుపై దాడి కేసు
- ప్రస్తుతం నెల్లూరు జైల్లో నిందితులు

8లో

ఐదేళ్ల వైసీపీ పాలన తర్వాత పల్లెలు అభివృద్ధి పరుగులు పెడుతున్నాయి. ముఖ్యంగా రహదారులు కొత్తరూపు దిద్దుకుంటున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ రోడ్లు సరికొత్తగా మారుతున్నాయి. జిల్లాలో రూ.162.94 కోట్ల నిధులతో 2,506 కిలోమీటర్ల మేర 1,965 సిమెంటు రోడ్లు, 42 బీటీ రోడ్లు వేసేందుకు పనులు చకచకా జరుగుతుండటమే ఇందుకు నిదర్శనం.

ఇన్నాళ్లకు దారికొచ్చాయి



ఘంటసాలలో నిర్మించిన సిమెంట్ రహదారి

జిల్లాలోని గ్రామీణ రహదారులకు మహర్దశ

ఉపాధి హామీ పథకం నిధులు రూ.162.94 కోట్లతో అభివృద్ధి

- 1,965 సిమెంట్ రోడ్లు, 42 బీటీ రోడ్ల నిర్మాణం
- పనులు పూర్తయితే మరిన్ని కేంద్ర నిధులు
- పనుల మంజూరులో కమీషన్లపర్వం
- అధికారులను ప్రసన్నం చేసుకుంటేనే కాంట్రాక్టులు
- కొన్ని రోడ్ల పనుల్లో నాణ్యత డొల్ల

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పక్కనపెట్టేశారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం గుట్టుచప్పుడు కాకుండా మళ్లించేసుకున్నారు. కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా విడుదల చేసిన నిధులతో పనులు చేయకుండా తీవ్ర జాప్యం చేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఐదేళ్లుగా అంతర్గత రహదారుల అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. ప్రజలు సరైన రహదారి సౌకర్యాలు లేక ఇక్కట్ల పాలయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల ఆమోదంతో పనులు చేసేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో జిల్లాలో రూ.162.94 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో 2,506 కిలోమీటర్ల మేర 1,965 సిమెంటు రోడ్లు, 42 బీటీ రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయి. ఈ ఏడాది విడుదలైన నిధులతో మార్చి నెలాఖరులోగా పనులు పూర్తిచేస్తే, 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధులు విడుదలయ్యే అవకాశం ఉంటుంది. ఉపాధి హామీ పథకం ద్వారా చేసే పనులకు ఇసుక కొరత లేకుండా ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం క్వారీ నుంచి తెచ్చుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం పనులు సులువుగా కావడానికి మరో కారణం.

నియోజకవర్గాల వారీగా పనుల వివరాలు

- అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం 454 పనులు కాగా, రూ.25.55 కోట్లతో 43.95 కిలోమీటర్ల మేర సిమెంట్, తారురోడ్లను వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 354 పనులు ప్రారంభమయ్యాయి. 94 సిమెంటు రోడ్ల పనులు చేస్తుండగా, 9.38 కిలోమీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. 11 పనులు పురోగతిలో ఉన్నాయి.
- గన్నవరం నియోజకవర్గంలోని 96 రహదారులను 28.90 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.18.71 కోట్ల అంచనాలు రూపొందించారు. 77 పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. 2.29 కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారుల నిర్మాణం పూర్తయింది.
- గుడివాడ నియోజకవర్గంలో మొత్తం 277 పనులు కాగా, రూ.21.92 కోట్లతో 38.7 కిలోమీటర్ల మేర రోడ్లు అభివృద్ధి చేయాలని అంచనాలు రూపొందించారు. ఇప్పటికి 180 పనులు ప్రారంభమయ్యాయి. 1.19 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి. 13 పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి.
- మచిలీపట్నం నియోజకవర్గంలో మొత్తం 363 పనులు కాగా, రూ.29.88 కోట్ల అంచనాలు

మిగతా 6లో..



స్టాల్ బయట విక్రయాలు



ఫుడ్ ప్లాజాకు ఆహార పదార్థాల చేరవేత

ఫుడ్ ట్రాక్ తప్పింది

ఆంధ్రజ్యోతి పరిశీలన

గడువు ముగిసినా అనధికారికంగా ఆహార వ్యాపారం చేస్తూ రైల్వే ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ఐఆర్‌సీటీసీ, రైల్వేస్టేషన్, కమర్షియల్ విభాగంలోని కొందరు అధికారుల అండతో రైల్వేస్టేషన్ కేంద్రంగా 'సెల్ కిచెన్' వ్యాపారాన్ని చాటుగా నడిపిస్తున్నారు. రైల్వేలో జరుగుతున్న ఈ అవినీతి వ్యవహారాలపై ఇటీవల సీబీఐ దృష్టిపెట్టి డీఆర్‌ఎం స్థాయి అధికారులను పట్టుకుంటున్నా అవినీతి అధికారుల్లో కనీస చలనం కూడా లేకుండాపోయింది.

రైల్వేస్టేషన్‌లో అనధికారికంగా సెల్ కిచెన్ వ్యాపారం

- కాంట్రాక్టు గడువు ముగిసినా చాటుగా నిర్వహణ
- ఫుడ్ ప్లాజా స్టాల్‌లో ప్యాకింగ్.. రైళ్లకు అందజేత
- రైల్వేకు రోజుకు రూ.1.30 లక్షల నష్టం
- ఆ మేరకు నిర్వహకుడికి లబ్ధి.. భారీ ఆదాయం

విజయవాడ, సికింద్రాబాద్ అధికారుల అండతోనే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/రైల్వే స్టేషన్) : రైల్వే ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకు అందించేందుకు ఐఆర్‌సీటీసీ నేతృత్వంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లో సెల్ కిచెన్‌ను ఏర్పాటుచేశారు. దీని కాంట్రాక్టు గడువు ముగిసి చాలాకాలం అవుతున్నా అధికారులు మాత్రం ఇంతవరకు టెండర్లు పిలవలేదు. కానీ, సెల్ కిచెన్ మాత్రం రైల్వేస్టేషన్‌లో అనధికారికంగా వ్యాపారం నిర్వహిస్తోంది. దీంతో రైల్వేకు రోజుకు రూ.1.30 లక్షల నష్టం వస్తుండగా, ఆ మొత్తాన్ని అనధికార వ్యక్తులు పొందుతూ ఆహార విక్రయాల ద్వారా రూ.కోట్లు గడిస్తున్నారు. ఈ అక్రమ వ్యవహారంలో సికింద్రాబాద్‌కు చెందిన ఐఆర్‌సీటీసీ అధికారులతో పాటు విజయవాడ రైల్వేస్టేషన్, కమర్షియల్ విభాగంలోని కొందరు అధికారుల హస్తం ఉన్నట్టు తెలుస్తోంది.

అధికారుల అండతో భారీ రాబడి

రైల్వేస్టేషన్‌లోని ఆరో నెంబర్ ప్లాట్‌ఫాంపై ఈ సెల్ కిచెన్‌ను ఏర్పాటు చేశారు. రోజుకు రూ.1.30 లక్షల అద్దె ప్రాతిపదికన ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటుచేసిన సెల్ కిచెన్ గడువు ముగిసింది. ఆ తర్వాత సెల్ కిచెన్‌కు రైల్వే అధికారులు ఎలాంటి టెండర్లు పిలవలేదు. టెండర్లు పిలిస్తే రైల్వేకు ఆదాయం వస్తుంది. కానీ, అనధికారికంగా ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంలో ఈ సెల్ కిచెన్‌ను నడుపుతున్నారు. ఫుడ్ ప్లాజా స్టాల్ కేంద్రంగా ఈ సెల్ కిచెన్ కార్యకలాపాలు సాగుతున్నాయి. వీటన్నింటి సబ్ లీజుదారుడు ఒక్కరే కావడంతో అనధికా రికంగా కార్యకలాపాలు నడిచిపోతున్నాయి. సాధారణంగా ఫుడ్ ప్లాజా విధులు ఇంచుమించు ఇలాగే ఉంటాయి. కానీ, ఆహారాన్ని రైళ్లకు అందించకూడదు. రైళ్లకు ఒక్క సెల్ కిచెన్ మాత్రమే అందించాలి. దీంతో గడువు ముగిసినా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకే నిర్వాహకులు ఫుడ్ ప్లాజాను ఎంచుకున్నారు. ఇక్కడి నుంచి బాక్సుల్లో ఆహారాన్ని సర్ది, రైళ్లకు చేరవేస్తున్నారు. దీంతో నిర్వాహకు డికి రోజుకు రూ.1.30 లక్షల అద్దె మిగులుతోంది. ఈ వ్యాపారానికి ఐఆర్‌సీటీసీ, రైల్వేస్టేషన్, కమర్షియల్ విభాగం లోని కొందరు అధికారులు తెరవెనుక సహకారం అందిస్తు న్నారు. ఇందుకు ప్రతిఫలంగా నిర్వాహకుల నుంచి భారీగా వాటాలు వెళ్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంపై సీబీఐ అధికారులు దృష్టిపెడితే తప్ప అంతర్గతంగా చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. నిర్వాహకులు రైల్వేబోర్డును కూడా శాసించే స్థాయిలో ఉండటమే ఇందుకు కారణం.

ఆంధ్రజ్యోతి పరిశీలనలో నిజాలు

ఈ ఫుడ్ ప్లాజాలో సెల్ కిచెన్ అనధికార నిర్వహణపై గురువారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలన జరిపింది. ఫుడ్ ప్లాజాలోని స్టాల్‌లో సెల్ కిచెన్ ఏర్పాటు చేసుకున్నారు. పెద్ద బాండీలలో ఫుడ్‌ను బయట నుంచి సెల్ కిచెన్‌లోకి తెస్తున్నారు. ఇక్కడే ప్యాకింగ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఫుడ్ ప్యాకెట్లను పకడ్బందీగా రైళ్లకు అందిస్తున్నారు. ఫుడ్ ప్లాజా బయట ప్లాట్‌ఫాంపై టేబుల్స్ వేసి మరీ ఆహార ప్యాకెట్లను విక్రయిస్తుండటం గమనార్హం.

బెజవాడకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ బాలాజీ

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గురువారం రాత్రి ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో రామ్‌నాథ్ దంపతులు గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. వారికి కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర రావు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన రాజ్‌భవన్‌కు వెళ్లారు. నగరంలో ఏర్పాటు చేసిన రెండు ముఖ్యమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రామ్‌నాథ్ దంపతులు విచ్చేశారు. వారికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు సాదరస్వాగతం పలికారు. రెండు రోజులు నగరంలోనే ఉంటారు.

అప్పుడే కొక్కొరొక్కో..

కూచిపూడిలో ముందే సంక్రాంతి ఒప్పందాలు

- కృష్ణా, గుంటూరు జిల్లాల పందెపు రాయుళ్ల సమావేశం
- సంక్రాంతికి మూడు రోజుల షెడ్యూల్ విడుదల
- ఇప్పటికే కూచిపూడిలో లాడ్జీల బుకింగ్
- మెజారిటీ విజేతలకు ఎన్‌ఫీల్డ్ బైక్ బహుమతి

8లో

ఎటు చూసినా అయ్యప్పలే..







శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములతో బెజవాడ జంక్షన్ కిటకిటలాడింది. భక్తులతో స్టేషన్‌లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్పలు విజయవాడకు పలు వాహనాల్లో చేరుకుంటున్నారు. అనంతరం వారంతా ఒకటోనెంబర్ ప్లాట్‌ఫామ్‌పైనే సేదదీరుతున్నారు. మరికొందరు బుకింగ్ కౌంటర్ల వద్ద విశ్రమిస్తున్నారు. (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ నుంచి శబరిమలకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతుండటంతో.. విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చి ఇక్కడి నుంచి శబరిమలకు బయలుదేరుతున్నారు. ఒక రోజు ముందుగానే స్టేషన్‌కు చేరుకుని ఇక్కడే పట్టాలపైనే స్నానమాచరిస్తున్నారు. స్టేషన్‌లోనే అయ్యప్ప పూజలు చేస్తున్నారు. ప్రత్యేక రైళ్ల కోసం ఎదురుచూస్తూ అక్కడే విశ్రమిస్తున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అన్ని వర్గాలు ఈసారి పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్ష చేపట్టారు. దీంతో రైల్వే స్టేషన్ భక్తులతో సందడిగా మారింది. రైల్వే అధికారులు కూడా అయ్యప్పల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అదనపు బోగీలు నడపటంతో పాటు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. విజయవాడ డివిజన్ పరిధిలో 20 వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్లు, ప్లాట్‌ఫామ్స్ ఎటు చూసినా అయ్యప్పల కోలాహలంతో సందడి నెలకొంది.

వైద్య కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

» మంత్రి సత్యకుమార్ యాదవ్



మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైద్య కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గురువారం మచిలీపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో కళాశాలల నిర్వహణ విఫలమైందన్నారు. జగన్ సీఎంగా ఉన్నా సొంత జిల్లాలోనే వైద్య కళాశాలను సమర్థవంతంగా నిర్వహించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో కళాశాలల భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 17 వైద్య కళాశాల అభివృద్ధిపై సమీక్షించామన్నారు. పారా మెడికల్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సక్రమంగా డ్రెయిన్లు పూడికలు తీయలేదని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా దోమల బెడద ఉందని సర్వేలో తేలిందన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు నిర్వహించి నివేదికలు తెప్పిస్తున్నామని, కలుషిత నీరు సరఫరా చేయకుండా మునిసిపాలిటీలు, పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీలపై మంత్రికి సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు.



క్యూలైన్ల పనులు ప్రారంభిస్తున్న ఈవో రామారావు

భవానీదీక్షల విరమణకు ఏర్పాట్లు

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భవానీదీక్షల విరమణలకు సంబంధించి ఏర్పాట్లు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రతీఏడాది జరుగుతున్న సంప్రదాయంలో భాగంగా మండల, అర్ధమండల దీక్షలు తీసుకున్న వారంతా దీక్షల విరమణకు భారీ సంఖ్యలో దేవస్థానానికి రానున్నారు. అత్యధిక శాతం భక్తులు ఆలయంలోనే దీక్షలు విరమించనున్నారు. ఈక్రమంలో భక్తులకు అమ్మవారి శీఘ్రదర్శనానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. గురువారం కెనాల్ రోడ్డులో వినాయకుడి గుడి వద్ద క్యూ ఏర్పాట్లకు సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. తొలుత ఈవో కేఎస్ రామారావు, ఈఈ వైకుంఠరావు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, వైదిక సిబ్బంది విఘ్నేశ్వరుని పూజ, వాస్తుపూజ చేసి గుంజలను నిలబెట్టారు. విఘ్నేశ్వరుడి పూజతో పాటు దుర్గమ్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అమ్మవారి చెంతన దీక్ష విరమణల కార్యక్రమం నిర్విఘ్నంగా, విజయవంతంగా జరగాలంటూ సంకల్పించి క్యూ నిర్మాణాలను ప్రారంభించారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావుపూలే

» కృష్ణా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే వర్ధంతి సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సంక్షేమం, సాధికారిత అధికారి జి.రమేష్, బీసీ సంక్షేమ సంఘం అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ అలియా బేగం తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో పురోగతి సాధించాలి - జిల్లా ఎస్పీ



మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేసుల్లో వేగవంతంగా దర్యాప్తు చేస్తూ పురోగతిని సాధించి బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశపు హాలులో గురువారం నేర సమీక్షా సమావేశం జరిగింది. పలు అంశాలపై పోలీసు అధికారులకు ఎస్పీ సూచనలు ఇచ్చారు. మహిళల, పిల్లల నేరాల విషయంలో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టుల్లో ఛార్జి షీటు దాఖలు చేయాలన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. గంజాయి తాగే ప్రాంతాలను గుర్తించి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. నైట్‌బీట్‌లు పెంచుతూ దొంగతనాలు జరగకుండా అరికట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సైన్‌బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలపై సత్వర విచారణ చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ, డీఎస్పీ, సిఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

2న ఉమ్మడి జిల్లాల టీటీ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో అసోసియేషన్ కార్యాలయంలో అండర్-15 బాలబాలికలు, పురుషులు, మహిళల ఎంపిక పోటీలను డిసెంబరు 2వ తేదీ ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బొడ్డు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను డిసెంబరు 20, 21వ తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రసాయి చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు కోచ్‌లు షారూఖ్ అక్రమ్‌ను 9494908977 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు కామినేని, కాగిత కృష్ణప్రసాద్, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ తదితరులు

కృష్ణా జిల్లా అభివృద్ధిలో ముడాది కీలక పాత్ర

» మంత్రి సత్యకుమార్ యాదవ్ » ముడా చైర్మన్‌గా మట్టా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంతో పాటు కృష్ణా జిల్లా అభివృద్ధిలో ముడా కీలక పాత్ర వహించాలని.. ఆ దిశగా నూతన చైర్మన్ మట్టా ప్రసాద్ కృషి చేయాలని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా గురువారం బీజేపీ నేత మట్టా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ముడా వైస్‌చైర్మన్, జేసీ గీతాంజలి శర్మ సమక్షంలో ఫైళ్లపై సంతకాలు చేశారు. అనంతరం మంత్రి మంత్రి మాట్లాడుతూ, బందరు పోర్టు అభివృద్ధిలో ముడా గతంలో గణనీయమైన పాత్ర వహించిందన్నారు. నగర అభివృద్ధితో పాటు కలంకారీకి కేంద్రమైన పెడన నియోజకవర్గ అభివృద్ధిని చేపట్టాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, బందరు పోర్టు అభివృద్ధి ద్వారా జిల్లా రూపురేఖలే మారిపోతాయన్నారు. జిల్లా అభివృద్ధిలో ముడా ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ, శక్తివంచన లేకుండా తనకిచ్చిన బాధ్యతలను నిర్వహిస్తానని చెప్పారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, వీరంకి గురుమూర్తి, బత్తిన దాసు, చిగురుపాటి కుమారస్వామి, ఎస్.దయాకరరెడ్డి, సురేంద్రమోహన్, షేక్‌బాజీ, యామిని శర్మ, పంతం గజేంద్ర, బొమ్మిడి గణేష్, కొనకళ్ల బుల్లయ్య, కాగిత వెంకటేశ్వరరావు, తదితరులు మాట్లాడారు.

జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా పద్మాదేవి

మచిలీపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా పద్మాదేవిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆమె నెల్లూరుజిల్లా విజిలెన్స్ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా ఆమె కొనసాగాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైతులనుంచి ధాన్యం కొనుగోలుకు సక్రమంగా చర్యలు తీసుకోకపోవడం, వారు ఇబ్బందులపాలయ్యే పరిస్థితులకు గురిచేయడం కారణాలతో ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా పనిచేస్తున్న డి.సృజనను ఆ బాధ్యతలనుంచి తప్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫసల్ బీమాతో రైతుకు ధీమా

» నష్టాల నుంచి ఆదాయ స్థిరీకరణకు భరోసా
» పథకంపై రైతుల్లో అవగాహన కల్పించాలి
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతుకు భరోసా కల్పించేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను అమలుచేస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనాతో కలిసి పథకం అమలుపై జిల్లాస్థాయి పర్యవేక్షణ, జాయింట్ కమిటీ, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమా పథకం (రబీ 2024-25) పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడికి నష్టం వాటిల్లిన సందర్భంలో రైతుకు భరోసా కల్పించేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణ, రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఉపయోగపడుతుందన్నారు. పథకం ద్వారా పూర్తి ప్రయోజనం పొందే విషయమై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, దిగుబడి ఆధారిత పథకం అమలు విధివిధానాలు, ఎంపిక చేసిన పంటలు, బీమా యూనిట్లు, ప్రీమియం రేట్లు, బీమా మొత్తం, పరిహారాన్ని లెక్కించే విధానం తదితర అంశాలను వివరించాలని అధికారులకు సూచించారు.



పంటల బీమా పథకం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా అధికారులు

- జిల్లాలో పథకం అమలుకు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ వ్యవహరిస్తోందని వివరించారు. వరికి గ్రామం యూనిట్‌గా, మొక్కజొన్నకు మండలం యూనిట్‌గా, శెనగలకు జిల్లా యూనిట్‌గా తీసుకోవడం జరుగుతుందన్నారు.
- వరి, మొక్కజొన్నలకు ఎకరాకు రూ.42 వేలు బీమా మొత్తానికి రూ.126 ప్రీమియం, శెనగలకు ఎకరాకు రూ.28 వేలు బీమా మొత్తానికి రూ.56 ప్రీమియం రైతులు చెల్లించాల్సి వుంటుందని తెలిపారు. పథకంలో చేరేందుకు వరికి డిసెంబరు 31లోగా మొక్కజొన్న, శెనగలకు డిసెంబరు 15లోగా ప్రీమియం చెల్లించాల్సి వుంటుందని వ్యవసాయశాఖ అధికారులు వివరించారు.
- పంట రుణం తీసుకుంటే సంబంధిత బ్యాంకు నేరుగా బీమా కంపెనీకి ప్రీమియం చెల్లిస్తుందని, రుణం తీసుకోని రైతులు మాత్రం ప్రీమియంను సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ తదితర మార్గాల ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ విషయంలో గ్రామస్థాయిలోని రైతు సేవా కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలన్నారు.
- నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్ (ఎన్‌సీఐపీ) ద్వారా నేరుగా వెబ్‌సైట్లో/మొబైల్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. పథకానికి సంబంధించి పూర్తి వివరాలకు రైతు సేవాకేంద్రాలు, మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పంటల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్య దీపికలను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రగతిశీల రైతులు శీలంనేని సాంబశివరావు, ఉప్పుగుండ్ల మాధవరావు, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, సీపీఓ వై.శ్రీలత, గరికపాడు కేవీకే శాస్త్రవేత్త శివప్రసాద్, ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ కృష్ణప్రసాద్, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధి యు.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో సాధారణ సౌకర్యాల కేంద్రాలు చెప్పండి

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో గత అయిదు సంవత్సరాల్లో సాధారణ సౌకర్యాల కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు.. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్ని ఉన్నాయి.. వివరాలు తెలపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీనిపై కేంద్ర మైక్రో, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలశాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరందాజే బదులిస్తూ ఏపీలో ఎంఎస్ఈ సీడీపీ కింద 7, ఐడీ ప్రాజెక్టులు 21 ఆమోదం పొందాయన్నారు. 2021-2022లో గోల్డ్ ఆభరణాల క్లస్టర్ సాధారణ సౌకర్య కేంద్రం ఏర్పాటు జరిగిందన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై అధికారుల చర్యలు

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వీరపనేనిగూడెంలో మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. తహసీల్దారు కేవీ శివయ్య ఆదేశాల మేరకు ఆర్ఐ రవి, వీఆర్వోలు మట్టి తవ్వకాలు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ఇటుక బట్టీల వద్ద పోసిన గుట్టలను తహసీల్దారుకు రిపోర్టు చేశారు. మట్టి తవ్వకందారులను పిలిపించి మాట్లాడారు. క్యూబిక్ మీటర్ చొప్పున జరిమానా చెల్లించాలని, లేకుంటే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.



సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువహీరో గల్లా అశోక్

నగరంలో గల్లా అశోక్ సందడి

భారతీనగర్ : యువహీరో సూపర్ స్టార్ కృష్ణ మనవడు గల్లా అశోక్ నగరంలో సందడి చేశారు. దేవకీనందన వాసుదేవ చిత్రప్రమోషన్‌లో భాగంగా గురువారం సాయంత్రం విజయవాడ విచ్చేశారు. ఈ సందర్భంగా గల్లా అశోక్ గురునానక్ రోడ్డులోని కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ మేరకు ధాన్యాన్ని తరలించాలి

» ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ సరిగా అమలు కావడం లేదని, దీనిని నిరసిస్తూ డిసెంబరు 2, 3 తేదీల్లో నిరసనలు చేపట్టనున్నట్టు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నామని, ఆచరణలో ప్రభుత్వ ప్రయత్నాలు అమలు జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ ధాన్యం కోతలు వేగంగా జరుగుతున్నాయని, సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరగని కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోసిన ధాన్యం 48 గంటల్లోనే ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కోరుతూ స్థానికంగా రైతులు నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉండటం లేదని, ఆర్బీకేల వద్ద చూపిన తేమ శాతాన్నే ఫైనల్‌గా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. రేటు విషయంలో కూడా ఆర్బీకేల వద్ద రేటు ఫైనల్ చేయాలని కోరారు. రైతులు ధాన్యం నూర్చిన వెంటనే మిల్లులకు లేదా మార్కెట్ యార్డులకు తరలించాలని, దీనికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. తేమశాతాన్ని 25వరకు సడలించినట్టు మంత్రి హామీ ప్రకారం ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల నుంచి ధాన్యం తరలించే వాహనాల సంఖ్య పరిమితిని తొలగించాలని, కేరళ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం ఇస్తున్న దానికి అదనంగా క్వింటాకు కనీసం రూ.500లు బోనస్ ప్రకటించాలన్నారు. అన్ని మిల్లులు డ్రయర్ మిల్లులుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో రైతులు పంటలు ఆరబెట్టుకోవడానికి వీలుగా స్థలాలను సేకరించి అభివృద్ధి చేయాలన్నారు.



వాట్సాప్ నెంబరులో ధాన్యం అమ్మకాలు షెడ్యూలు రిజిస్టర్‌ను చూపుతున్న హరిబాబు

అంతర్ జిల్లాల ఆర్చరీకి ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహానాడు రోడ్డులోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో గురువారం ఎంపిక పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పోటీల్లో సత్తా చాటిన వారిని ఏపీ సీనియర్ అంతర్ జిల్లాల టోర్నీకి ఎంపికచేసినట్టు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి తెలిపారు.



రికర్వ్ పురుషులు: ఎం.జైనేంద్ర నాయుడు, ఎ.శ్రీకృష్ణ సాత్విక్, వై వేణుగోపాల్‌రావు, **మహిళలు:** కె.చంద్రహాసిని, కె యుక్త శ్రీ, టి.భువన రాజేశ్వరి, టి.వైష్ణవి, సీహెచ్ డాలీ శివానీ, ఎ.వీర అస్మిత, కె.పూజిత, **కాంపౌండ్ పురుషులు:** టి త్రినాథ్ చౌదరీ, బి.రవితేజ, ఇ.సాయి రాధాకృష్ణమూర్తి, పి.చరణ్ శ్రీకర్, అబ్దుల్ రషీద్, జి.బాజీ నాగుల్ మీరా, మహిళల విభాగంలో కె.రిషి కీర్తన, బి.షణ్ముక నాగ సాయి, బి ప్రియ వైష్ణవిలు ఎంపికయ్యారు.

1న అండర్-12 క్రికెట్ సెలక్షన్స్

విజయవాడ స్పోర్ట్సు : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్ వద్ద డిసెంబరు 1 ఉదయం 8 గంటలకు కేడీసీఏ అండర్-12 బాలుర క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్టు కేడీసీఏ సెక్రటరీ ఎం.రవీంద్ర చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012 సెప్టెంబరు 1వ తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, హాజరయ్యే క్రీడాకారులు పుట్టినతేదీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్, జిరాక్సులతో పాటు తమ వ్యక్తిగత కిట్, బాల్స్‌తో రావాలని రవీంద్ర తెలిపారు.

రెజ్లింగ్‌లో ఠాగూర్ సన్నీకి కాంస్యం

విజయవాడ స్పోర్ట్సు : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హరిద్వారాలోని ప్రేమ్‌నగర్ ఆశ్రమంలో ఈ నెల 20న ముగిసిన జాతీయస్థాయి రెజ్లింగ్‌లో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్సు కళాశాల విద్యార్థులు 71 కిలోల పురుషుల విభాగంలో వి లె నిన్(సెకండ్ బీబీఏ), వి సింహాద్రి(సెకండ్ బికామ్), ఠాగూర్ సన్నీ(సెకండ్ బీఎస్సీ)లు పాల్గొన్నారు. ఇందులో ఠాగూర్‌సన్నీ కాంస్యంతో సత్తా చాటాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం రమేష్, యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డిలు విద్యార్థులను అభినందించారు.



రెజ్లింగ్ క్రీడాకారులతో ప్రిన్సిపాల్, యాజమాన్యం

ఇన్నాళ్లకు దారికొచ్చాయి

(5వ పేజీ తరువాయి)

రూపొందించారు. 50 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికి 256 పనులు ప్రారంభమయ్యాయి. 5.74 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తయింది.

- పామర్రు నియోజకవర్గంలో 433 రహదారులను రూ.23.84 కోట్లతో 36.10 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని అంచనాలు రూపొందించారు. ఇప్పటివరకు 357 పనులు ప్రారంభించారు. 6.6 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తయింది.
- పెడన నియోజకవర్గంలో 297 రహదారులను రూ.18.76 కోట్ల అంచనాతో 36.10 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. 267 పనులను ఇప్పటికే ప్రారంభించారు. మూడు కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తయింది.
- పెనమలూరు నియోజకవర్గంలో 120 రహదారులను రూ.22.75 కోట్ల అంచనాతో 26.30 కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారులుగా మార్చాలని నిర్ణయించారు. 106 పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. 3.2 కిలోమీటర్ల మేర రోడ్లు పూర్తయ్యాయి.

కమీషన్లు వసూలుచేసి మరీ పనులు ఇచ్చారా?

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రహదారుల పనులు చేసేందుకు అధికారులు కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు వసూలు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులకు మూడుశాతం చొప్పున కమీషన్ ఇవ్వాలని చెప్పడమే కాకుండా ముక్కుపిండి మరీ వసూలు చేశారని చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల కమీషన్‌తో పాటు తమకు రావాల్సిన కమీషన్‌ను కూడా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ముందే వసూలు చేయడం గమనార్హం. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతను కొంతమేర పక్కనపెట్టి చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనుల్లో నాణ్యతపై దృష్టి పెట్టాలని, పనుల పరిశీలన అంశాలపై క్షేత్రస్థాయిలో సిబ్బందికి కలెక్టర్ శిక్షణా తరగతులు నిర్వహించారు. అయినా కొందరు కాంట్రాక్టర్లు సిమెంట్ రహదారుల కిందవేసే జీఎస్‌బీ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

1న బ్రాహ్మణ పరిషత్ కార్తీక వనసమారాధన

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం సమీపంలోని సపోటాతోటలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనను డిసెంబరు 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, కార్యదర్శి గోపరాజు సత్యపవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పూజలు, ఆటపాటలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆగిరిపల్లి వేద పాఠశాల విద్యార్థులు వేద పారాయణం చేస్తారని తెలిపారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, బ్రాహ్మణుల సమస్యలపై మాట్లాడతారని వారు పేర్కొన్నారు.



ఆత్కూరులో సొసైటీ అధికారులతో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి

జేఎల్జీలకు న్యాయం చేయండి

● కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి డిమాండ్

ఉంగుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మూడేళ్ల క్రితం ఆత్కూరు పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలు, అధికారులు చేసిన అవినీతికి జేఎల్జీ(జాయింట్ లయబిలిటీ గ్రూపు)లపై భారం వేయడం తగదు. పీఏసీఎస్‌లో అధికారులు దోచుకున్న అవినీతి సొమ్మును రికవరీ చేయడంలో ఏళ్ల తరబడి విచారణ జరిపిన అధికారులు కౌలురైతులు తీసుకున్న రుణాలను మూడేళ్ల వడ్డీతోసహా చెల్లించాలని నోటీసులు పంపడం సరికాదు. ఉన్నతాధికారులు స్పందించి జేఎల్జీ గ్రూపులకు న్యాయం చేయాలి.' అని కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి డిమాండ్ చేశా రు. ఆత్కూరు కో-ఆపరేటివ్ సొసైటీలో 2021లో అవకతవకలు జరగడంతో 2024 వరకు అధికారులు విచారణ జరిపి, వాటిని సరిచేశారు. విచారణ సమయంలో జేఎల్జీ గ్రూపుల వద్ద రుణాలు కట్టించుకోలేదు. రెండు నెలలుగా బ్యాంక్ లావాదేవీలు పూర్తిగా గాడినపడడంతో ఇటీవల రుణాలు చెల్లించాలని జేఎల్జీ గ్రూపు బాధ్యులకు డిమాండ్ నోటీసులు పంపించారు. నోటీసులు అందుకున్న కౌలురైతులు గురువారం లక్ష్మణస్వామిని కలిసి తమ పరిస్థితిని వివరించారు. దీంతో జేఎల్జీ గ్రూపులకు మద్దతుగా గ్రూపు సభ్యులతో కలిసి గురువారం పీఏసీఎస్‌కు లక్ష్మణస్వామి వెళ్లి కొద్దిసేపు సొసైటీ ఎదుట ఆందోళన చేశారు. కౌలురైతులకు జారీచేసిన నోటీసులపై బ్యాంక్ అధికారులను వివరణ కోరారు. 'రుణం తీసుకున్న ఏడాదిలోపు చెల్లించేందుకు పలుమార్లు బ్యాంకుకు వచ్చి సిబ్బందిని కట్టించుకోమని అడిగాం. జరిగిన అవకతవకలు సరిచేశాక, కట్టించుకుంటామని చెప్పి ఎందుకు తిప్పి పంపారు. ఇప్పుడు రూ.లక్షకు 35వేలు వడ్డీ కట్టాలని ఎలా నోటీసులు జారీ చేస్తారు. తీసుకున్న అసలు మాత్రమే కట్టగలం. వడ్డీ కట్టలేం.' అని బ్యాంకు అధికారులకు పలువురు గ్రూపు సభ్యులు స్పష్టంచేశారు. ఇది తమ పరిధిలోది కాదని, ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామని బ్యాంక్ అధికారులు తెలిపారు. తీసుకున్న అప్పుకు వడ్డీ మినహాయించి అసలు ఎప్పుడు కట్టమంటే అప్పుడు కడతామని కౌలురైతులు స్పష్టంచేసి బయటకు వచ్చారు. బుచ్చినాయుడు, వంగపండు రామకృష్ణ, నిమ్మకూరి ప్రకాశం, కర్నాటి రాఘవులు, కడవకొల్లు రామరాజు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల దాతృత్వం



ప్రిన్సిపాల్ ఎంఎస్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియాకు బిస్కెట్లు, తినుబండారాలను విరాళంగా అందిస్తున్న విద్యార్థులు

ప్రసాదంపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సేవాభావాన్ని పెంపొందించడానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం కృషి చేస్తోందని, చైల్డ్ ఎయిడ్ ఫౌండేషన్, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.40 వేలు అందజేసిందని పాఠశాల వైస్ చైర్మన్ పరిమి నరేంద్ర బాబు తెలిపారు. గురువారం ఎనికేపాడు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో స్వచ్ఛంద సంస్థలకు విరాళం కోసం ఫెతేని నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పలు వంటకాలను తయారు చేసి, విక్రయించగా వచ్చిన నగదును ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజ్, పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్, కడియాల ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం ఎస్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో స్థల వివాదం

● స్థలం చుట్టూ స్తంభాలు పాతిన ఓ వర్గం
● అడ్డుకుని తొలగించేసిన మరో వర్గం

పెనమలూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యనమలకుదురులో 66 సెంట్ల స్థలం యాజమాన్య హక్కులపై వివాదం నెలకొనడంతో రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థలం తమదేనంటూ బుధవారం అర్ధరాత్రి ఓ వర్గానికి చెందిన వారు స్థలంలోకి ప్రవేశించి స్తంభాలు పాతడానికి ప్రయత్నించారు. నగరంలోని ప్రముఖ వస్త్రదుకాణానికి చెందిన మరో వర్గం స్థల యజమాని దుబాయ్ వెళ్లారని ఆయన వచ్చిన తర్వాత యాజమాన్య హక్కులు ఎవరివో తేల్చుకుని స్తంభాలు పాతుకోండని సూచించారు. అయినా వినకుండా స్తంభాలు పాతడానికి ప్రయత్నించడంతో వారిని వస్త్ర దుకాణానికి చెందిన ఉద్యోగులు, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అవతలి వర్గం వారు వెళ్లిపోయారు.

డయల్ యువర్ డీఎం నేడు

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు 87909 96090కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలపాలని, సలహాలను ఇవ్వాలని ఆయన సూచించారు. ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని డీఎం కోరారు.

దుస్తులు, పండ్ల పంపిణీ

ఉయ్యూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురజాడ డొంకరోడ్డు చెరువుకట్ట గిరిజన కాలనీ పిల్లలకు ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి ఆధ్వర్యంలో గురువారం పండ్లు, దుస్తులు, తినుబండారాలు పంపిణీ చేశారు. క్లబ్ ద్వారా సభ్యుల సహాయ సహకారాలతో అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నామని సుధారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుష్మ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీలు అందజేత

ఉయ్యూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన ఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన కొడాలి దిలీప్ వితరణగా గురువారం కుర్చీలు అందజేశారు. వైద్యం కోసం ఆరోగ్యకేంద్రానికి వచ్చేవారు నిరీక్షించేందుకు కుర్చీలు లేక నిలబడేందుకు ఇబ్బంది పడుతున్నారని, సిబ్బంది తెలియజేయడంతో కుర్చీలు అందించామని దిలీప్ తెలిపారు. దిలీప్‌కు వైద్యురాలు తేజస్విని, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

స్త్రీ విద్యకు ఆద్యుడు పూలే

వర్ధంతి సందర్భంగా జ్యోతిరావుపూలే చిత్రపటాలకు నివాళులర్పించిన నేతలు



రంగన్నగూడెంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ, సర్పంచ్ రంగామణి, ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్త్రీ విద్యకు ఆద్యుడు జ్యోతిరావు పూలే అని ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ అన్నారు. రంగన్నగూడెంలో గురువారం నిర్వహించిన జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి కార్యక్రమంలో పూలే చిత్రపటానికి ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ కసుకుర్తి రంగామణితో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, కాట్రు పాపారావు, కొలుసు గంగాజలం పాల్గొన్నారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పోరంకి టీడీపీ కార్యాలయంలో..

పెనమలూరు: విద్యతోనే సాధికారత సాధ్యమని సందేశాన్నిచ్చిన మహనీయుడు జ్యోతిరావుపూలే అని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్ పేర్కొన్నారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, శొంఠి శివరాంప్రసాద్, కోయ ఆనంద్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్వర్ బాషా, గట్టు బుల్లయ్య, వీరంకి శశికాంత్, ఎండీ సాదిక్, కరిముల్లా, తుమ్మల రాంకుమార్, సందీప్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల

కల్పనే ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమకూర్చిన మోటార్లకు పూజలు చేస్తున్న సర్పంచ్ రంగామణి, ఆళ్ల గోపాలకృష్ణ, మొవ్వా వేణుగోపాల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సాగునీటి వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం ఊరచెరువులో తాగునీరు నింపేందుకు పోలవరం కుడికాలువపై ఏర్పాటు చేసిన మోటార్లను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన సొంత నిధులతో సమకూర్చారని ఆయన తెలిపారు. మోటార్లను సర్పంచ్ కసుకుర్తి రంగామణి గురువారం పూజలు చేసి ప్రారంభించారు. గోదావరి జలాలకు హారతి ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పోలవరం కుడికాలువను ఏలూరు కాలువకు అనుసంధానం చేస్తూ 60వేల ఎకరాలకు సాగునీరందించే లింకు ఛానల్ పథకాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రకటించి, నెలల వ్యవధిలోనే టెండర్ల ప్రక్రియ వరకూ తెచ్చారని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా జలవనరుల అభివృద్ధికి, గ్రామాల్లో సీసీ రహదారులు, తాగునీరు వంటి మౌలికసదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రాధాన్యం ఇస్తున్నారని సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, టీడీపీ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్ తెలిపారు. వీఆర్వో సీమోను, పంచాయతీ కార్యదర్శి పద్మ, కనకవల్లి శేషగిరిరావు, పల్లగాని వీరాంజనేయులు, అర్జునరావు, వీర్ల సుబ్బయ్య, కాట్రు రామకృష్ణ పాల్గొన్నారు.

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను కలిగి ఉన్నా, రవాణాకు సహకరించినా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేఖ హెచ్చరించారు. కొయ్యూరు, మడిచర్ల గ్రామాల్లో గురువారం నిర్వహించిన దాడుల్లో చెరుకు తోటల్లో ఉంచిన సారా తయారీకి వినియోగించే 700 లీటర్ల బెల్లపు ఊటను సిబ్బందితో కలిసి ఆమె ధ్వంసం చేశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సురేఖ తెలిపారు. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బెల్టుషాపులపై దాడులు

ఉయ్యూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉయ్యూరు సర్కిల్ పరిధిలో బెల్టు షాపులపై దాడులు చేసి ఇప్పటిరకు 15 కేసులు నమోదు చేసినట్టు సీఐ శేషగిరిరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిని అరెస్టుచేస్తున్నామన్నారు. బుధవారం తోట్లవల్లూరు మండలం దేవరపల్లిలో ఓవ్యక్తి వద్ద నుంచి పది 180 ఎంఎల్ మద్యం సీసాలు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామన్నారు. బెల్టుషాపులు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయాలకు దాతల సహకారం అవసరం

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలకు దాతల సహకారం అవసరమని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు అన్నారు. గ్రేడ్-1 గ్రంథాలయానికి రోటరీ క్లబ్ సభ్యుడు కంభంపాటి సూర్యచంద్రరావు వాటర్ డిస్పెన్సర్‌ను గురువారం అందజేశారు. గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నర్రా సీతారామారావు సూచించారు. పుణ్యా చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్, టీఎస్ఆర్‌కె ప్రసాద్, చిమట రామారావు, గన్నె వెంకట్రావు, ఎం.రాధాకృష్ణ, గూడవల్లి సురేష్‌బాబు గ్రంథాలయ ఇన్‌చార్జి పి.దుర్గాలక్ష్మి, కంభంపాటి ధర్మారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వనసమారాధన



గోపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాలవర్ధనరావు తదితరులు

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెంపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం కార్తీక వనసమారాధన సందడిగా నిర్వహించారు. ఉదయం వెంకటేశ్వరరావు, కవిత దంపతులు గోపూజ, ఉసిరి చెట్టుకు పూజ చేశారు. కార్తీక పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, విజయ డెయిరి చైర్మన్ చలసాని ఆంజనేయులు, ప్రముఖ న్యాయవాదులు కేవీ రమణ, చుక్కపల్లి భాను ప్రకాష్, గూడపాటి లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు జూపల్లి సురేష్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, మండవ లక్ష్మి, చిక్కవరపు నాగమణి, మండవ అన్వేష్, షేక్ అబుల్యాజ్, చీమలదండు రామకృష్ణ పాల్గొన్నారు. 2400 మందికి అన్నసమారాధన నిర్వహించారు.



ఉంగుటూరు హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ బొబ్బా వెంకటాద్రి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని

సద్వినియోగం చేసుకోండి

ఉంగుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఉంగుటూరు జడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ బొబ్బా వెంకటాద్రి అన్నారు. పాఠశాలలో నూతన భవన నిర్మాణానికి భూరి విరాళం అందజేసిన ఆయన గురువారం పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మాతృభాషా పరిజ్ఞానం, సాంకేతిక అంశాల్లో వారికున్న అవగాహనను ప్రశ్నలరూపంలో అడిగి తెలుసుకున్నారు. దాతలు కల్పించిన మౌలిక వసతులు, సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతి పరిజ్ఞానంపై మరింత పట్టు సాధించాలని, అనుకున్న లక్ష్యాలను పట్టుదల, క్రమశిక్షణతో చేరుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం చోరగుడి అనిత, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ పులి శ్రీనివాసరావు, ఏపీఎన్ఆర్‌టీఎస్ డిప్యూటీ డైరెక్టర్ బి.విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం..

నిందితుడిపై పోక్సో కేసు

పెనమలూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పదహారేళ్ల బాలికపై పలుమార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేసిన వ్యక్తిపై పెనమలూరు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. తాడిగడప రాంనగర్‌కట్టపై నివాసముండే రసూల్ తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి రెండేళ్లుగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తీసుకెళ్లి లైంగికంగా వేధించి సంబంధం పెట్టుకున్నాడని, ఆమె ప్రస్తుతం రెండు నెలల గర్భవతి అని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి..

పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలు

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుడు విద్యుత్ స్తంభం పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం గన్నవరం గౌడ బజార్‌లో జరిగింది. గౌడబజార్‌లో వీధి లైట్లు వెలగటం లేదని ఫిర్యాదు రాడంతో కార్మికుడు గోగం శ్రీనివాసరావు లైట్లు వేసేందుకు అక్కడకు వెళ్లాడు. విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసి, దానిపై నుంచి లైట్లు వేస్తుండగా నిచ్చెన జరిగింది. శ్రీనివాసరావు విద్యుత్ వైర్లను పట్టుకోవటంతో షాక్ కొట్టింది. అక్కడ నుంచి కింద పడిపోయాడు. స్థానికులు చూసి పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి శ్రీనివాసరావును కుటుంబసభ్యులు విజయవాడ తీసుకువెళ్లినట్లు కార్యదర్శి చెన్నకేశవరావు తెలిపారు. శ్రీనివాసరావు గాయపడడానికి పంచాయతీ అధికారులే కారణమని ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు ఆరోపించారు. వీధిలైట్లు వేసేటప్పుడు మరొకరు లేకుండా ఎందుకు పంపించారని ఆయన ప్రశ్నించారు.



పామర్రు వద్ద జాతీయ రహదారిపై ధాన్యపు రాశులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు

● మిల్లర్లకు మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరిక

పామర్రు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ మద్దతు ధర చెల్లించకుండా, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు సృష్టిస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే మిల్లులను మూసివేస్తాం. ధాన్యం రవాణాకు వాహనాలు, టార్పిలిన్లు, గోనె సంచులు అన్ని మండలాల్లో అందుబాటులో ఉంచమని ఆదేశాలిచ్చాం.' అని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. కనుమూరు, అడ్డాడ, కొత్తపెదమద్దాలి గ్రామాల్లో జాతీయ రహదారిపై రైతులు పరదాలు కప్పి ఉంచిన ధాన్యం రాశులను ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ధాన్యం తరలించాక మిల్లర్లు ఇబ్బంది పెడితే పౌరసరఫరాల జిల్లా అధికారులకు గానీ లేదా తనకు గానీ నేరుగా ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు సేవాకేంద్రాల్లో నిర్ధారించిన తేమశాతానికి మిల్లర్ల వద్ద తేమశాతానికి వత్యాసం ఉంటోందని, 1262 రకం ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ మంత్రి దృష్టికి తెచ్చారు. తేమశాతం 25 ఉన్నా 5కిలోల తరుగుతో మిల్లర్లు దిగుమతి చేసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

అప్పుడే కోడిపందేలకు కొక్కొరోకో..!

● కూచిపూడిలో ముందుగానే ఒప్పందాలు ● మెజార్టీ పందేలు గెలిచిన వారికి ఎన్ ఫీల్డ్ బైక్ బహుమతి



కూచిపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భాల్లో నిర్వహించే కోడిపందాలకు నిర్వాహకులు ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుని అడ్వాన్స్‌లు పుచ్చుకుంటున్నారు. ఎక్కువ పందాలు తమ బరుల్లో జరిగేలా ప్రణాళికలు రూపొందించుకుని పందెం రాయుళ్లను ఆకర్షించేలా మెజార్టీ పందాలు గెలిచిన వారికి ఎన్ ఫీల్డ్ బైక్ బహుమతిగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. దీనికి సంబంధించి రెండు రోజుల క్రితం కూచిపూడి కేంద్రంగా ఉభయ కృష్ణాజిల్లాలతోపాటు గుంటూరు జిల్లాకు చెందిన పందెం రాయుళ్లతో నిర్వాహకులు సమావేశమై విధివిధానాలు మాట్లాడుకున్నారు. పెద్ద బరుల్లో మినిమం రూ.లక్ష, మరో రెండు బరుల్లో రూ.50 వేలు, రూ.25 వేలు, ఆ లోపు పందాలు కాసుకునేలా ఒప్పందాలు జరిగాయి. పండుగ ముందు రెండు లేదా మూడు రోజులపాటు క్రీడలు నిర్వహించి, ఈ ముసుగులో మూడు రోజులపాటు కోడి పందాలు, చిత్తులాట, పేకాట, ఇతర జూద క్రీడలు నిర్వహించేలా రూపకల్పన చేశారు. పందాల్లో అరితేరిన ఓ మాజీ సర్పంచ్, ఈవెంట్ నిర్వాహకుడు ఈ బరి నిర్వహించేలా కసరత్తులు ప్రారంభించారు. ఇప్పటికే కూచిపూడిలోని లాడ్జి రూములు బుక్ చేసినట్టు సమాచారం. ఉభయ కృష్ణా జిల్లాలతోపాటు గుంటూరు జిల్లాలో పేరు మోసిన కోడిపందాల రాయుళ్ల ఈ మేరకు కూచిపూడిలో సమావేశమై విధివిధానాలు చేర్పించుకుని కొంతమేర అడ్వాన్స్‌లు కలుపుకున్నారు. ఈ బరుల్లోనే మూడు రోజుల పాటు వ్యాపారాలు చేసుకునే దుకాణదారులు బరి నిర్వాహకులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో ఎండీ పరిశీలన



ఆర్టీసీ వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

బస్‌స్టేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌ను గురువారం ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా సర్వీసబుల్ చాసిస్ మీద, కొత్త బస్ కోచ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన వర్క్‌షాపులో ప్రతి సెక్షన్‌ను పరిశీలించి, అక్కడ జరుగుతున్న అధునాతన పనులను తెలుసుకున్నారు. వరదలు వచ్చాక ఏర్పాటు చేసిన మిషన్లు, గతంలో ఉన్న మిషన్లు ఎలా పనిచేస్తున్నాయనే అంశాలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఉద్యోగులకు రావాల్సిన పాత బకాయిలను విడతల వారీగా అందిస్తామన్నారు. విజయవాడ జోన్ ఈడీలు గోపీనాథరెడ్డి, రవివర్మ, అప్పలరాజు, చెంగల్ రెడ్డి, సీఈవో సుధాకర్, హెడ్ ఆఫీస్ సీఎంఈ విజయరత్నం, డిప్యూటీ సీఎంఈలు విమల, నీలిమ, విజిలెన్స్ ఏడీ శోభా మంజరి, సీనియర్ లా ఆఫీసర్ పద్మజవాణి, ఈఈ రాజశేఖర్, వర్క్స్ మేనేజర్ సత్యనారాయణ, ఉషారాణి, ఇతర అధికారులు, ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఒక మామిడి మొక్కను ద్వారకా తిరుమలరావు నాటారు.

నేడు ఈయూ రాష్ట్ర కమిటీతో ఆర్టీసీ ఈడీల సమావేశం

ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం, ఆర్టీసీ మేనేజ్‌మెంట్ వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 29న ఆర్టీసీ హౌస్‌లో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సమావేశం కానున్నట్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి ఈవీ నరసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న ఉద్యోగుల సమస్యలను ప్రస్తావిస్తూ రవాణ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఇచ్చిన వినతి పత్రాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

కొనసాగుతున్న కార్మికుల రిలే దీక్షలు

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గన్నవరం అయోధ్య అపార్టుమెంట్ నిర్మాణంలో కార్మికులకు కావాల్సిన రూ.4కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 2వ రోజుకు చేరాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అనుచరుల్లో ఒకరైన గుర్రం అంజయ్య (నాని) నాలుగేళ్ల పాటు పనులు చేయించుకుని డబ్బులివ్వాల్సి వచ్చేసరికి ఇవ్వాల్సిన పని లేదంటూ భయభ్రాంతులకు గురి చేశారని వాపోయారు. 8 ఏళ్లగా కార్మికుల కష్టార్జితాన్ని ఇవ్వకుండా తమపై ఎదురు దాడికి దిగారంటూ ఆరోపించారు. ఈ సందర్భంగా మేస్త్రీలు రామ్మోహనరావు, సతీష్ మాట్లాడుతూ తమ బాధలు ఎవరికీ చెప్పడం లేదన్నారు. 2018 నుంచి పనులు చేయించుకుని డబ్బులివ్వలేదన్నారు. అదేమంటే దొంగ లెక్కలు చూపి తమకు రావాల్సిన పని లేదంటూ బుకాయిస్తున్నారన్నారు. 14 మంది మేస్త్రులు కింద రోజూ 1200 మంది కార్మికులు పని చేసేవారన్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహన రంగాకు ఎప్పటికప్పుడు కార్మికులకు డబ్బులిచ్చేసినట్లు గుర్రం నాని చెప్పినట్టు తెలిసిందన్నారు. తమకు డబ్బులిస్తే రోడ్డుకు ఎందుకు ఎక్కుతామన్నారు. గుర్రం నానితో పాటు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నారాయణ ప్రసాద్, సైట్ ఇంజనీర్ సాయి సుందర్ తప్పుడు లెక్కలు వేసి పైసా రాదని చెబుతున్నారన్నారు. తమకు న్యాయం జరగకకుంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. బాబు, తేజ, వెంకన్న, హసీనా, ప్రసన్న, లక్ష్మీ పాల్గొన్నారు.



2వ రోజు రిలే దీక్ష చేస్తున్న అయోధ్య అపార్టుమెంట్స్ బాధితులు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న జేడీ విజయ

మహిళల సమానత్వానికి రాజ్యాంగమే హామీ

● ప్రాసిక్యూషన్స్ జేడీ విజయ

పెనమలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం మహిళలందరి సమానత్వానికి హామీ ఇస్తుందని ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ ఎం విజయ పేర్కొన్నారు. గురువారం పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మహిళలపై హింసను అరికట్టండనే అంశంపై జరిగిన ఒక రోజు సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. అతిథిగా హాజరైన సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారతలో చెప్పుకోదగ్గ కార్యక్రమాలను నిర్వహించడంలో సేఫ్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. డాక్టర్ నీరజ, కే స్వరూపరాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో దేవకీ నందనుడి సందడి



లబ్బీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'దేవకీ నందన వాసుదేవ' చిత్ర యూనిట్ గురువారం నగరంలో సందడి చేసింది. చిత్రం విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు నిర్వహిస్తున్న విజయయాత్రలో భాగంగా చిత్రం బృందం ట్రెండ్ సెట్ మాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు. ప్రశాంత్ వర్మ కథతో దర్శకుడు అర్జున్ జంధ్యాల తెరకెక్కించిన చిత్రం అఖిలాంధ్ర ప్రేక్షకులను అకట్టుకుందన్నారు. అనంతరం దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ తమ చిత్రానికి విజయం అందించిన ప్రేక్షకులను రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా గురునానక్ కాలనీలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి హీరో గల్లా అశోక్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.



కృష్ణా తరంగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణా వర్శిటీ రెక్టార్, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ తదితరులు

వచ్చేనెల 10 నుంచి కృష్ణాతరంగ్

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వర్శిటీ అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వచ్చేనెల 10, 11, 12న వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను గురువారం కృష్ణా వర్శిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ డాక్టర్ టీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, కృష్ణాతరంగ్ కో-కన్వీనర్ డాక్టర్ కె.రామకృష్ణ, హిందూ హైస్కూల్స్ కమిటీ పాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కృష్ణా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని నిర్వాహకులు తెలిపారు. సంగీతం, నాట్యం, సారస్వతం వంటి వాటిలో పోటీలు జరుగుతాయని, పాల్గొనదలచిన విద్యార్థులు నిర్దేశిత దరఖాస్తులో వివరాలు పూర్తిచేసి వర్శిటీ వెబ్‌సైట్‌లో మెయిల్‌కు పంపించాలన్నారు. వివరాలకు 9951167965 ఫోన్‌లో సంప్రదించవచ్చన్నారు.

తల్లీ, బిడ్డల ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి


● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనంగా పది పడకల తల్లి, బిడ్డల ఆరోగ్యసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, శిశువులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన వైద్యసిబ్బంది, ఇతర మౌలిక సౌకర్యాల పెంపు, వాటికి కావాల్సిన నిధులను నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మంజూరు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. గురువారం, లోక్‌సభలో రూల్ 377 కింద కేశినేని ఈ అంశాన్ని లేవనెత్తారు. తన నియోజకవర్గంలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం జనాభా 11,35,129 మంది ఉన్నారని, ఇందులో గర్భిణుల సంఖ్య 17,624, శిశువులు 15,247గా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి జేపీ నడ్డా తన విజ్ఞప్తిపై దృష్టి సారించాలని కోరారు.

హిసార్ - తిరుపతి మధ్య వీక్లీ రైలు

రైల్వేస్టేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు హిసార్ - తిరుపతి మధ్య వీక్లీ రైలును నడుపుతున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 7 నుంచి 14 వరకు శనివారం నడిచే హిసార్ - తిరుపతి (04717) రెండు సర్వీసులు నడుస్తోంది. డిసెంబరు 9 నుంచి 16 వరకు సోమవారం నడిచే (04718) తిరుపతి - హిసార్ రైలు కూడా రెండు సర్వీసులు నడుస్తోంది. ఈ ప్రత్యేక రైళ్ల గూడూరు, నెల్లూరు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, సిరిపూర్ కాగజ్‌నగర్, బలార్షా మాదపూర్, హిటార్సి, భూపాల్, సంత్ హిద్దరామ్‌నగర్, సుజల్‌పూర్, ఉజ్జయిని, నాగ్డా, రాంగంజిమండీ, కోట, సవాయి మధుపూర్, దుర్గాపుర, జైపూర్, దహ ర్యా బాలాజీ, లింగాస్, శిఖర్, నావల్‌గృహ్, జుంజునును, చిర్లా, లోహార్, సాదూర్‌పూర్ మీదుగా గమ్యాన్ని చేరుకుంటాయి. ఇదే సమయంలో హిసార్ - తిరుపతి రైలు రాత్రి 1.20 గంటలకు విజయవాడ చేరుకుని 1.30కి బయలుదేరుతుంది. తిరుపతి - హిసార్ రైలు ఉదయం 7.10కి చేరుకుని 7.20కి బయలుదేరుతుంది. ఒంగోలులో హిసార్ - తిరుపతి రైలు వేకువజామున 3.28 గంటలకు చేరుకుని 3.30కి బయలుదేరుతుంది. తిరుపతి - హిసార్ రైలు కూడా ఇదే సమయంలో ఒంగోలుకు వస్తుంది. నెల్లూరులో హిసార్ - తిరుపతి రైలు ఉదయం 4.48కి వచ్చి 4.50 గంటలకు బయలుదేరుతుంది. తిరుపతి - హిసార్ రైలు రాత్రి 1.53కు వచ్చి 1.55 గంటలకు బయలుదేరుతుంది.

సింగపూర్ నేషనల్ చెస్‌లో సంహిత, శౌర్య సత్తా



విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగిన సింగపూర్ నేషనల్ ఏజ్ గ్రూప్ చెస్ చాంపియన్‌షిప్‌లో ముస్తాబాద స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థిని, లా ఫస్ట్‌ియర్ చదువుతున్న గార్నేని మేఘా సంహిత అండర్-16 విభాగంలో తృతీయస్థానంలోను, స్కాట్స్‌పైన్ ఇంటర్నేషనల్ విజయవాడ విద్యార్థి శౌర్య కొండ్రు అండర్-9లో ఐదోస్థానంలో నిలిచారు. వీరిని వరల్డ్ చాంప్ విశ్వనాథన్ ఆనంద్ అభినందించినట్లు చీఫ్ కోచ్ బొబ్బా తెలిపారు.

రిమాండ్‌లో ఉన్న 8 మందికి రెండు రోజుల పోలీస్ కస్టడీ

గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కాసన్నేని రంగబాబుపై జరిగిన దాడి ఘటనలో ఈ నెల 19న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులైన 8 మందిని గన్నవరం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు పెట్టగా రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. వారిని నెల్లూరు జైలుకు తరలించారు. ఏ7 గుర్రం అంజయ్య అలియాస్ నాని, ఏ8 కర్నాటి నిరంజన్‌కుమార్, ఏ9 ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగా, ఏ10 మేచినేని వెంకట శివ సత్యన్నారాయణ అలియాస్ బాబు, ఏ11 అనగాని రవి, ఏ12 గొన్నూరు సీమయ్య, ఏ14 భీమవరపు యెతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, ఏ15 సూరపనేని అనిల్‌ను పోలీసులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి రెండు రోజుల పాటు (29, 30 తేదీలు) పోలీస్ కస్టడీకిస్తూ జడ్జీ తీర్పునిచ్చారు. ఈ 8 మందిని నెల్లూరులోనే పోలీసులు విచారణ చేయనున్నారు.

వైకల్యం మనిషికే గానీ మనసుకు కాదు

● విభిన్న ప్రతిభావంతుల్లో మనోధైర్యాన్ని నింపేందుకే క్రీడల నిర్వహణ ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



విభిన్న ప్రతిభావంతుల ఆటలపోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైకల్యమనేది మనిషికే కానీ, మనస్సుకు కాదని విభిన్న ప్రతిభావంతుల ప్రతిభ ముందు వైకల్యం చిన్నబోతుందని క్రీడల్లో రాణించడం ద్వారా విభిన్న ప్రతిభావంతులు సకలాంగులకు దీటుగా సత్తాను చాటాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తొలుత కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అవకాశమిస్తే ఎంతటి విజయాలనైనా సాధించగలుగుతారన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేతగా భావించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వి.కామరాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయిలో జూనియర్, సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో చెస్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, రన్నింగ్, ట్రైసైకిల్ రేస్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు ప్రశాంతి, వార్డెన్ నాగస్వర్ణ, స్టాఫ్‌నర్స్ సులోచన రాణి, సహాయకులు అవినాష్, సాయిబాబు, సుజిత, రాణి, విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహం, మడోన్నా మూగ బదిరిల కళాశాల, మానసిక వికాస కేంద్రం, ప్రేమవికాస్, ప్రేమనికేతన్, విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ బ్లైండ్‌కు చెందిన క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.

ఆరోగ్యంతో ఆటలు!

● తక్కువ ధరకు కాలం చెల్లిన పదార్థాల విక్రయం
● ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయట పడిన వ్యవహారం
● రూ.10లక్షల విలువైన సరుకు సీజ్



విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రూ.10 విలువైన బిస్కెట్ ప్యాకెట్ ధర రూ.5, రూ.30 ఎమ్మార్పీ ఉన్న కేకుల ప్యాకెట్ రూ.15. కిలో రూ.200 విక్రయించే కిస్‌మిస్ రూ.100. ఇవన్నీ కార్పొరేట్ మాల్స్ ప్రకటించిన ఆఫర్లు కాదు. అలాగని కొత్తగా ప్రారంభించిన షాపు యజమాని తొలిరోజున వినియోగదారులకిచ్చిన అవకాశం అంతకన్నా కాదు. బహుళజాతి సంస్థల నుంచి కాలం చెల్లిన పదార్థాలను కొనుగోలు చేసి ఇక్కడి ప్రజలకు 50శాతం తక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యవహారమిది. విజయవాడ అంటేనే కల్తీకి మారుపేరుగా మారింది. నెయ్యి, టీ పొడి, కారంలో ఇప్పటి వరకు కల్తీని చూపించిన వ్యాపారులు ధనదాహంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. వన్‌టౌన్‌లో కేటీ రోడ్డులో కాలం చెల్లిన వస్తువులు, పదార్థాలను విక్రయిస్తున్న గుర్రం లింగయ్య జనరల్ స్టోర్స్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం సోదాలు నిర్వహించారు. షాపును నిర్వహిస్తున్న గోపాలకృష్ణ కాలం చెల్లిన, కాలం చెల్లడానికి రోజుల సమయం ఉన్న తినుబండారాలను హైదరాబాద్, బెంగళూరులోని బహుళజాతి సంస్థల నుంచి ఎమ్మార్పీ కంటే 20శాతం తక్కువకు కొని విజయవాడకు తీసుకొచ్చి ఎమ్మార్పీ కంటే 50శాతం తక్కువకు విక్రయిస్తున్నాడు. కొన్నేళ్లుగా ఇలా చేస్తున్నాడు. దీనిపై సమాచారం రావడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు నెల రోజులుగా నిఘా పెట్టారు. ఈ షాపులో సోదాలు నిర్వహించగా రూ.10లక్షల విలువైన నిల్వ సరుకులున్నట్టు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు షాపులో సరుకును అధికారులు లెక్కిస్తూనే ఉన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ నిధి మీనా

పూలే ఆశయాలు నేటితరానికి స్ఫూర్తిదాయకం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం మహిళా అభ్యున్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే ఆశయాలు నేటితరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆయన ఆలోచనలను ఆచరణలోకి పెట్టడం ద్వారా ఘన నివాళులు అర్పించినట్టు అవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ గురువారం కలెక్టరేట్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండేందుకు కారణం మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచన విధానాలే కారణమన్నారు. తన సహధర్మచారిణి విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడం ద్వారా ఆమె దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు కాగలిగారన్నారు. జేసీ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, వ్యవసాయ అధికారిణి విజయకుమారి, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక దృఢత్వం

● త్వరలో యువజన క్రీడోత్సవాలు ● పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు ఎప్పటికప్పుడు పనితీరును మెరుగుపరుచుకుని ముందుకు అడుగులు వేయాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని వ్యాస్ కాంప్లెక్స్ వెనుక ఉన్న ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీసు వార్షిక క్రీడాపోటీలను గురువారం ప్రారంభించారు. నిత్యం పని ఒత్తిడితో పోలీసులు 2024లో విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారన్నారు. పోలీసులపై ప్రజలకు అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా పనితీరులో మార్పులు చేస్తున్నామన్నారు. ఇప్పుడు సాంకేతిక నైపుణ్యంతో కేసులను ఛేదిస్తున్నామన్నారు. చాలాకేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం ప్రధానంగా మారిందన్నారు. శారీరక, మానసిక శ్రమ ఒత్తిడి పోలీసులపై ఉంటుందన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేస్తున్నా క్రీడలు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. సమాజానికి పోలీసు శాఖ దిక్సూచిగా మారాలన్నారు. త్వరలో యువజన క్రీడోత్సవాలు నిర్వహించే ఆలోచనలో ఉన్నామన్నారు. పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. విధుల్లో మహిళా పోలీసులు చాలా చురుగ్గా పని చేస్తున్నారన్నారు. పోలీసులు ఏడు టీంలుగా ఏర్పడి పోటీల్లో పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముందు టీంల నుంచి సీపీ గౌరవవందనం స్వీకరించారు. డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, మహేశ్వరరాజు, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏఆర్ ఏడీసీపీ ప్రసాదరావు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

మోకాళ్లపై నిలబడి వలంటీర్ల నిరసన

చిట్టినగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లను కొనసాగించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం ఎదురుగా వలంటీర్లు మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు మాట్లాడుతూ ఉగాది పండుగ రోజు శుభవార్త చెప్తానని నమ్మపలికి వలంటీర్ల ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. శాసనమండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి ప్రకటించడం బాధకరమన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని కోరారు. 5 నెలల బకాయిలు చెల్లించాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీ మమత, నేతలు రాజ్‌కుమార్, రమేష్, అబ్దుల్, ఏ. మురళి, జీ.వాణి,కాంచన పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

కళ్లకు గంతలతో టీచర్ల నిరసన

ధర్నాచౌక్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, జీవితాలు పెంచుతామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కాలేదని గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ టీచర్లు, లెక్చరర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ధర్నాచౌక్‌లో కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. డీఎస్సీ నుంచి తమ పోస్టులు మినహాయించలేదన్నారు. ఈ నెల 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమ విధులను బహిష్కరించి శాంతియుతంగా నిరసన దీక్షలు చేపట్టామన్నారు. అయినా అధికారులు న్యాయం చేయలేదని, కనీసం చర్చలకు కూడా పిలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గురుకుల టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు కే.లక్ష్మీనాయక్, జె.మల్లిఖార్జున నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.పరమేష్, ఎస్ఎన్.బాబు, ఏ.తారా, సునీత అధిక సంఖ్యలో టీచర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ప్రాణాలను నిలిపిన కానిస్టేబుల్



ప్రసాదంపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండె నొప్పితో బాధపడుతున్న తమిళనాడుకు చెందిన లారీడ్రైవర్ టీ.కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆతడి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్నారు 4వ ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు. ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు వివరాల మేరకు ప్రసాదంపాడు పంచాయతీ సమీపంలో రహదారి పక్కన నిలిపిన లారీని గమనించిన కానిస్టేబుల్ చూడగా డ్రైవర్ గుండెనొప్పితో విలవిలలాడుతున్నాడని, కానిస్టేబుల్ హుటాహుటిన డ్రైవర్‌ను ప్రభుత్వాసుత్రికి తరలించారన్నారు. వెంటనే స్పందించి వైద్యసహాయం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని వైద్యులు తెలిపారన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.600



ప్రజల భాగస్వామ్యంతో గుడివాడ సమగ్రాభివృద్ధి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మీ కోసం-మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనంపై ఆయన పర్యటించారు. ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి పట్టణంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కమిషనర్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

1262 రకం ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

● కౌలురైతు సంఘం డిమాండ్

తోట్లవల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారులు తక్షణమే 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శివనాగేంద్రం, పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు.

వల్లూరుపాలెం కృష్ణానది ఒడ్డున ఉన్న 1262 రకం ధాన్యం రాశులను గురువారం రైతులతో కలిసి పరిశీలించారు. 1262 రకం వరిని సాగుచేసినపుడు వ్యవసాయాధికారులు ఈ-క్రాప్ చేశారని, ఇపుడు పంట చేతి కొచ్చాక కొనుగోలులో ఇబ్బందులు పెట్టడం తగదని, 15 రోజులుగా రైతులు ధాన్యాన్ని అట్టిపెట్టుకుని ఎదురు చూసే పరిస్థితిని కల్పించటం బాధాకరమని శివనాగేంద్రం పేర్కొన్నారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై తక్కువ ధరకే ధాన్యాన్ని కొని రైతులను దోచుకునే కుట్ర కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. తుఫాను వాతావరణ పరిస్థితుల్లో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు పంపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, కోసిన ధాన్యాన్ని 48 గంటల్లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు జుజ్జువరపు ఏసేబు, సింహాద్రి రాంబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

సామాజికతత్వవేత్త జ్యోతిరావు పూలే

● వర్థంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన అధికారులు, బీసీ సంఘాల నాయకులు

పెదపారుపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావు పూలే భారత తొలి సామాజిక తత్వవేత్త అని, సమాజానికి ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమని పెద పారుపూడి ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పూలే చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సహాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహరావు, మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్థంతి సందర్భంగా మెయిన్‌రోడ్డులోని జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మున్సిపల్ ఏవో జీటీ నాయుడు నివాళ్ళులర్పించారు.

కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో సాహితీ స్రవంతి పట్టణ శాఖ ఆధ్వర్యంలో లంకా సురేంద్ర ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు

● మిల్లర్లకు మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరిక



పామర్రులో జాతీయ రహదారి పక్కన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే కుమార్ రాజా

పామర్రు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వ మద్దతు ధర చెల్లించకుండా, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు సృష్టిస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే మిల్లులను మూసివేస్తాం. ధాన్యం రవాణాకు వాహనాలు, టార్పాలిన్లు, గోనె సంచులు అన్ని మండలాల్లో అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశాలు ఇచ్చాం.' అని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు.

కనుమూరు, అడ్డాడ, కొత్తపెదమద్దాలి గ్రామాల్లో జాతీయ రహదారులపై రైతులు పరదాలు కప్పి ఉంచిన ధాన్యం రాశులను ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ధాన్యం తరలించాక మిల్లర్లు ఇబ్బంది పెడితే పౌరసరఫరా జిల్లా అధికారులకు గానీ లేదా తనకు గానీ నేరుగా ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో టీఏలు నిర్ధారించిన తేమశాతానికి మిల్లర్ల వద్ద దిగుమతి సమయంలో తేమశాతానికి వత్యాసం ఉంటోందని, ఎంటీయూ 1262 రకం ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ మంత్రి దృష్టికి తెచ్చారు. ధాన్యం తేమశాతం 25 వరకు ఉన్నా ఐదుకిలోల తరుగుతో మిల్లర్లు దిగుమతి చేసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జీపీఎస్ లేని వాహనాల్లోనూ ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవచ్చని సూచించారు. కౌలు రైతుల గ్రామాల్లో వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా ధాన్యం అమ్ముకోచ్చునన్నారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ చిమట పద్మాదేవి, డీఎస్వో వి.పార్వతి, ఆర్డీవో బీఎస్‌హేలా షారోన్ ,జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్.పద్మావతి పామర్రు ఏడిఏ స్వర్ణలత, తహసిల్దార్ రవికాంత్ పాల్గొన్నారు.



బొమ్ములూరులో రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే రాము

ధాన్యం విక్రయించిన 48 గంటల్లో ఖాతాల్లో నగదు జమ


గుడివాడ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'గుడివాడ నియోజకవర్గానికి సరిపడా గన్నీ బ్యాగ్‌లు సరఫరా చేస్తాం. మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా తీసుకోవాలని ఆదేశించాం. గుడివాడ నుంచే ధాన్యాన్ని మిల్లర్లకు మద్దతు ధరకే అమ్ముకోండి. మిల్లులకు తోలిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తాం'. అని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బొమ్ములూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఆయన పరిశీలించారు. వచ్చే ఏడాది ధాన్యం ఆరబెట్టే డ్రై మిషన్లు సబ్సిడీపై రైతులకు అందిస్తామని మంత్రి తెలిపారు. బొమ్ములూరు ఆర్‌బికే సెంటర్ నందు తదితర ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రేటు నిర్ణయించకుండా మిల్లర్ల దగ్గరకు పంపుతారని రైతులు తెలిపారు. మంత్రి స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రేటు నిర్ణయించి మిల్లర్లకు చెప్పాలన్నారు. సిబ్బంది సక్రమంగా పని చేయాలని హెచ్చరించారు. నియోజకవ ర్గంలో పండిన ప్రతీ ధాన్యం గింజను సరైన రేటుకు అమ్ముకునే విధంగా చూస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఏడీఏ ఎస్.రమాదేవి, తహసీల్దార్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మండల కార్యాలయం పెచ్చులూడి పడుతోంది!



ఇనుప చువ్వలతో ఊడిపడుతున్న రెండవ అంతస్థు శ్లాబ్

(ఆంధ్రజ్యోతి - నందివాడ) ఏడాది నుంచి మండల పరిషత్ కార్యాలయం పై అంతస్థు పెచ్చులూడి కింద పడుతున్నా, అధికారులు పట్టించుకోవటం లేదని ఎంపీటీసీ సభ్యులు చెబుతున్నారు. 2006లో రూ.28 లక్షలతో నిర్మించిన రెండంతస్థుల బిల్డింగ్ పై అంతస్థులో మండల సమావేశాలు జరిపేవారని, కొంతకాలంగా సమావేశాలను పక్క కార్యాలయంలో నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. బిల్డింగ్ పై అంతస్థు శ్లాబు మొత్తం ఇనుప చువ్వలతో సహా ఊడిపడడంతో ఎప్పుడు పై అంతస్థు కూలి పడుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. బిల్డింగ్‌పై భాగం శిథిలమవ్వడంతో వర్షపు నీరంతా కింది గదిలోకి చేరి, వరండా అంతా నీటితో మునిగిపోతోంది. అధికారులకు పట్టించుకోవడం లేదని అంటున్నారు. కార్యాలయానికి రావాలంటేనే భయంగా ఉందని మండలంలోని నాయకులు చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి బిల్డింగ్ పైఅంతస్థు పడగొట్టి మరలా నూతన స్లాబ్ పోసేలా చూడాలని ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కోరుతున్నారు.



శిథిలమవుతున్న పైఅంతస్థు



తట్టివర్రు పిరమిడ్ ధ్యాన కేంద్రంలో జ్యోతిని వెలిగిస్తున్న పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు రాజకుమారి, స్వర్ణలత తదితరులు

ఘనంగా పిరమిడ్ ధ్యాన కేంద్రం వార్షికోత్సవం

గుడివాడ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామన్నపూడిలోని శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం 12వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వాహకురాలు రాజకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఉయ్యూరు జ్ఞానక్షేత్రం నిర్వాహకులు స్వర్ణలత, పలువురు ధ్యాన గురువుల ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు కార్తీక వనసమారాధనలో పాల్గొన్నారు.



తాడంకి అండర్‌పాస్‌లో నిలిచిన నీటిని తొలగించిన హైవే అధికారులు

అండర్‌పాస్‌లో నీరు తొలగింపు

పమిడిముక్కల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై తాడంకి వద్ద అండర్‌పాస్‌లో నిలిచి ప్రమాదకరంగా ఉన్న నీటిని ఎట్టకేలకు తొలగించారు. అండర్ పాస్‌లో ఏడాది పొడవునా మోకాలులోతు నీరునిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటోందని, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు నడిపేవారు ఇబ్బంది పడుతున్నారని, 'అమ్మో అండర్ పాస్' పేరుతో బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి నీటిని తొలగించారు.



భూషణగుళ్ల పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రంగారావు

సాగునీటి సంఘాల ఎన్నికల కోసం పాఠశాలల పరిశీలన

పెదపారుపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికల కోసం పాఠశాలలను తహసీల్దార్ వై.రంగారావు పరిశీలించారు. వాటర్ యూజర్ అసోసియేషన్ నెంబర్ 38 వెంట్రప్రగడలోని 12 టీసీలకు పునుకొల్లు సత్యనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్ వెంట్రప్రగడ, వాటర్ యూజర్ అసోసియేషన్ నెంబర్ 51 యలమర్రులో ఉన్న 12టీసీలకు ఆర్.ఎ.వి.జిల్లా పరిషత్ హైస్కూల్ యలమర్రులో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని సూచించారు.

ముడా కార్యక్రమాలకు సహకరించాలి

● వేదవ్యాస్‌ను కోరిన చైర్మన్ మట్టా ప్రసాద్

మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముడా కార్యక్రమాల్లో తనకు సలహాలు ఇచ్చి సహకరించాలని ముడా మాజీ చైర్మన్, మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌ను ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ కోరారు. వేదవ్యాస్‌ను ముడా చైర్మన్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కాగా, వేదవ్యాస్ ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో బూరగడ్డ వేదవ్యాస్‌ను మట్టా ప్రసాద్ కలిశారు.



పోలుకొండలో ఒరిగిన విద్యుత్ స్తంభం

వేసిన రోజే ఒరిగిన విద్యుత్ స్తంభం

నందివాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలుకొండ నుంచి నాగభూషణపురం వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డులో బుధవారం నూతన స్తంభాలు వేశారు. పాత స్తంభాల స్థానంలో కొత్తవి వేయాలి. కానీ, కాంట్రాక్టర్లు పాత స్తంభాల స్థానంలో వేయకుండా రోడ్డు పైనే వేస్తున్నారు. స్తంభం పాతేందుకు ప్రయత్నిస్తే కింద ఉన్న పైపులైన్ పగిలిపోయింది. అదేస్థానంలో కొత్త స్తంభం దించడంతో పైపులైన్ పాడైపోయింది. కొత్త స్తంభాన్ని పూడ్చకుండా కాంట్రాక్టర్లు వదిలివేశారు. దీంతో స్తంభం పక్కకు ఒరిగిపోయింది. స్తంభానికి పైపులైన్ కేవీ వైర్లు బిగించి ఉన్నాయి. ఓ పక్క హౌస్‌లైన్లు ఉన్నాయి. స్తంభం పూర్తిగా ఒరిగిపోవటంతో చుట్టుపక్కల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



జాన్‌బాబుకు అభినందన

గుడివాడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడు సేలంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి పెద్ది జాన్‌బాబును ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు గురువారం కళాశాల ఆవరణలో సత్కరించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్ నాయుడు, వైస్‌ప్రిన్సిపాల్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాస్, జీవన్, రాధాకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయంలో వనసమారాధన

పామర్రు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శివాలయంలో గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు లంక బీష్మాకుమార్ దంపతుల నేతృత్వంలో కార్తీక వనసమారాధన మహోత్సవం సందడిగా నిర్వహించారు. మహాశివునికి కుంభాభిషేకం చేశారు. ఉసిరి చెట్టుకింద కార్తీక దామో దరుడికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. విష్ణుపారాయణం, కార్తీక పురాణం వినిపించారు. 15 వందల మంది వనసమారాధనలో పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రానికి కుర్చీల బహూకరణ

గుడివాడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అవసరమైన కుర్చీలను కొనకళ్ల వెంకటేశ్వరమ్మ జ్ఞాపకార్థం సీతయ్య గురువారం బహూకరించారు. మేనేజర్ లంకపల్లి పురుషోత్తం పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

పెదపారుపూడి/నందివాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈనెల 30వ తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తామని పెదపారుపూడి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, నం దివాడ ఎంపీడీవో మల్లేశ్వరి వేర్వేరుగా తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగా అందరికీ పింఛన్లు అందిస్తామన్నారు. ఒక నెలలో పింఛన్ తీసుకోని వారు మరుసటి నెలలో కూడా తీసుకోవచ్చని, 3వ నెలలో కచ్చితంగా తీసుకోవాలని, మూడు వరుస నెలలు తీసుకోని వారు పింఛన్ కోల్పోతారని స్పష్టం చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.600



సుబ్రహ్మణ్యం (ఫైల్)

తొమ్మిదో నెంబరు కాల్వలో యువకుడి గల్లంతు

మోపిదేవి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన పడమటి సుబ్రహ్మణ్యం (25) బుధవారం రాత్రి తొమ్మిదో నెంబరు కాల్వలో గల్లంతైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వీరంకి సుబ్బారావు, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి తొమ్మిదో నెంబర్ కాల్వ వద్దకు వెళ్లగా సుబ్బారావు, సుబ్రహ్మణ్యం కాల్వలో జారి పడ్డారు. గట్టుపై ఉన్న కొంత మంది సుబ్బారావును రక్షించగా, సుబ్రహ్మణ్యం నీటి ఒరవడికి కొట్టుకుపోయినట్లు తెలిపారు. సుబ్రహ్మణ్యం తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.



గూడూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

రైతుకు అండగా ఉన్నాం

రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోండి: మంత్రి నాదెండ్ల

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల పంటను ప్రభుత్వానికి విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన గూడూరు, చిట్టిగూడూరు, తరకటూరు గ్రామాలలో పర్యటించి రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ధాన్యం రాశులను పరిశీలించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అధిక తేమశాతం సాకుతో మిల్లర్లు మద్దతు ధరలో కోత విధిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఎలాంటి సమస్య ఉన్నా తనను ఫోనులో నేరుగా సంప్రదించవచ్చన్నారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. 24 గంటలలోపే రైతులకు ధాన్యం నగదు వారి ఖాతాలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుకు నచ్చిన మిల్లుకు తమ ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గతంలో ఉన్న 17 తేమశాతం నిబంధనను కొంత మేర సడలించామని, కేవలం ఐదు కేజీల తరుగుతో 24 శాతం వరకు తేమశాతం వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారిణి ఎన్.పద్మావతి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి పార్వతి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ సృజన, ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, ఏవో ఆంజనేయకుమార్, టీడీపీ నాయకులు పోతన స్వామి, అన్నం హరిరామకృష్ణ, ఎస్‌పే బేగ్, కూటమి నాయకులు పాల్గొన్నారు. మంత్రి మనోహర్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు గురువారం తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జనసేన నాయకుడు జక్కా ధర్మారాయుడు ఘనంగా స్వాగతం పలికారు.



మోపిదేవిలో సంపద తయారీ కేంద్రం



కరకట్ట వెంబడి గుమ్మరించిన చెత్త



కొక్కిలిగడ్డలో ముళ్లచెట్లు పెరిగిన సంపద కేంద్రం

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

• వైసీపీ ప్రభుత్వం వదిలేసింది • పంచాయతీలు నిర్లక్ష్యం చూపాయి • పల్లెల్లో ఎక్కడ చూసినా చెత్త గుట్టలే

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, పంచాయతీ పాలకులు, అధికారుల అశ్రద్ధ కారణంగా గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించడంతో నిర్లక్ష్యం కన్పిస్తోంది. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తగుట్టలు కన్పించడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. గతంలో చంద్రబాబు హయాంలో సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది. ప్రస్తుతం మరుగునపడిన సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి - మోపిదేవి : స్వచ్ఛభారత్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామ పంచాయతీలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల కోసం లక్షల రూపాయలు మంజూరు చేశాయి. గడిచిన కొన్నేళ్లుగా ఆయా గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల పేర్లతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా వారికి వేతనాలను మంజూరు చేసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర మిషన్‌లకు, గ్రామపంచాయతీల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు నిలిపివేయటంతో గ్రామపంచాయతీలే చెత్త సేకరణ ద్వారా వచ్చే నిధులతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. గ్రామపంచాయతీల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు మోపిదేవి మండలంలో అంతంత మాత్రంగానే ఉన్నాయి. మోపిదేవి, పెదప్రోలు, పెదకళ్లేపల్లిల్లో నామమాత్రంగా వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నప్పటికీ చెత్త సేకరణ, సేకరించిన చెత్తను కేంద్రాల్లో తరలించి వినియోగంలోకి తీసుకురావటం మాత్రం జరగడం లేదు. మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా సంపద తయారీ కేంద్రాలు నిర్మాణం జరిగింది. సంపద తయారీ కేంద్రాల భవనాలు నేడు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోపిదేవి, కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం, మెరకనపల్లి, మేళ్లమర్తిలంక గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు గ్రామాలకు దూరంగా నిర్మించటంతో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తీసుకెళ్లక ప్రధాన రహదారుల వెంబడి వేస్తున్నట్లు గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన మోపిదేవిలో ఇంటింటికి సేకరించిన చెత్తను కనీసం సంపద తయారీ కేంద్రానికి తీసుకెళ్లకుండా గ్రామ నడిబొడ్డులో ఉన్న కృష్ణానది పాత కరకట్ట వెంబడి గుమ్మరిస్తున్నారు. నిత్యం కరకట్ట రహదారి వెంబడి వందల సంఖ్యలో ప్రజలు, వాహనదారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపద తయారీ కేంద్రానికి చెత్త తరలించకుండా కరకట్ట రహదారి వెంబడి వేయడంతో అనేక పర్యాయాలు మండల, జిల్లాస్థాయి అధికారులకు ప్రజలు వినతిపత్రాల రూపంలో ఫిర్యాదులు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెత్త నుంచి సంపద సృష్టించి గ్రామపంచాయతీలకు ఆర్థికంగా భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి



గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మార్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

- కర్లపూడి పూర్ణచంద్రరావు, మోపిదేవి

వినియోగంలోకి తీసుకొస్తా

మండలంలోని గ్రామాల్లోనికి సంపద తయారీ కేంద్రాలను ఉన్నతాధికారులతో మాట్లాడి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.

-కె.టి.సుందరి, ఈవోపీఆర్డీ

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

పెడన రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్మవద్దని, రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్ముకుని మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి నూరున్నీసా అన్నారు. చేవేంద్ర, గురివిందగుంట గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో షెడ్యూల్ చెయించుకుని జీపీఎస్ ఉన్న వాహనం ద్వారా ట్రాక్‌షీట్‌తో ధాన్యాన్ని మిల్లులకు చేర్చితే 48 గంటలలో రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. సమస్యలేమైనా ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1967, లేదా జిల్లా కంట్రోల్ నంబరు 8247693551కి ఫోన్ చేయాలన్నారు. ,



చేవేంద్రలో రైతులకు సూచనలిస్తున్న ఏవో నూరున్నీసా



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కొల్లూరి వెంకటేశ్వరరావు

మోపిదేవి, నవంబరు 2 8(ఆంధ్రజ్యోతి) : దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. పెదప్రోలు, కాసానగర్‌ల వద్ద కోతలు కోసి రహదారుల వెంబడి ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాల్సిన గోనె సంచులు, వాహనాలు సకాలంలో అధికారులు అందించటం లేదని రైతులు పేర్కొన్నారు. ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ ఎం.శ్రీవిద్యలతో ఫోన్‌లో మాట్లాడి ధాన్యాన్ని తేమ శా తం లెక్కించకుండా ధాన్యం మిల్లులు తరలించేలా చూడాలని కోరారు. మేడికొండ విజయ్ పాల్గొన్నారు.



లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు



నాణేల అలంకరణలో కనువిందుచేస్తున్న శివలింగం



కోదండ రామాలయంలో కార్తీక దీపోత్సవం



సాయి ఆలయంలో దీపశోభ



శివాలయానికి విరాళం అందజేస్తున్న దాతలు

దుర్గా నాగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మోపిదేవి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లిలో స్వయంభువుగా కొలువై ఉన్న దుర్గా నాగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బుద్ధు వరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సాయి ఆలయంలో దీపోత్సవం

అవనిగడ్డ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బందలాయిచెరువు శ్రీసాయి జ్ఞాన మందిరం వద్ద గురువారం సాయి దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఆలయ నిర్వాహకురాలు సింహాద్రి లక్ష్మి, సాయి సేవక్ కె.ప్రియాంక ఆధ్వర్యంలో సాయి భక్తులు దీపాలు వెలిగించి హారతులిచ్చారు. భక్తులు సాయిబాబా గీతాలను ఆలపించారు. ఓం, శ్రీసాయి ఆకారంలో వెలిగించిన దీపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నాణేల అలంకరణతో శివలింగం కనువిందు

నాగాయలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరామపాదక్షేత్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం నందీశ్వరుడికి పాలాభిషేకాలు, శివలింగాన్ని రూ.50 వేలు విలువ గల 10, 5 నాణేలతో అలంకరించగా కనువిందు చేసింది. భక్తులు విరివిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

రామాలయంలో కార్తీక దీపారాధన

అవనిగడ్డ రూరల్ : పేర్లవానిలంక కోదండ రామాలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రమిదలతో దీపారాధనలు చేశారు.

వర్తక, వాణిజ్య మండలి వనసమారాధన

పెడన, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వర్తక వాణిజ్య మండలి ఆధ్వర్యంలో చిట్టూరి మాధవరావు తోటలో గురువారం కార్తీక వనసమారాధన వైభవంగా జరిగింది. ఉసిరిచెట్టు కింద పూజలు చేశారు. కాత్యాయని దేవికి పూజలు చేశారు. వనభోజనాలు చేశారు. కుటుంబాలతో సహా హాజరై ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. పట్టణ వర్తక వాణిజ్య మండలి ప్రతినిధులు బొలిశెట్టి సత్యనాగబాలరాజు, కొల్లిపర శ్రీనివాసరావు, నంబూరు లక్ష్మణరావు, వీరమల్లు వెంకటరత్నం, భవిరిశెట్టి నాగేశ్వరరావు, కొమ్మూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి రూ.1,01,116 విరాళం

కోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో పునర్నిర్మాణం చేస్తున్న శివరామకృష్ణ క్షేత్రం (శివాలయం) నిర్మాణానికి జన్ను వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు రూ .1,01,116 విరాళాన్ని అందజేశారు. శివరామకృష్ణ క్షేత్ర ఆలయ కమిటీ సభ్యులు జన్ను వెంకటేశ్వరరావు నివాసం వద్దకు వెళ్లి విరాళాన్ని స్వీకరించారు. అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, బడే భావన్నారాయణ, పెద్ది బాబూరావు, ఉల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

చల్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి 108 అంబులెన్స్‌లో మహిళ సురక్షితంగా ప్రసవించింది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన తుమ్మా వీరమ్మకు బుధవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్‌చేశారు. చల్లపల్లి నుంచి అంబులెన్స్ సిబ్బంది లక్ష్మీపురం చేరుకుని ఆమెను మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా జీలగలగండి సమీపంలో ఆశావర్కర్ ఎస్.పార్వతి సహకారంతో ఈఎంటీ దాసి బసవరాజు ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మచిలీపట్నం ఆసుపత్రిలో చేర్చారు. పైలట్ షఫీ అంబులెన్స్ నడిపారు.

దేవస్థానం ఆధ్వర్యంలో దిమ్మెల ఏర్పాటు

మోపిదేవి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : సుబ్బారాయుడి ఆస్తులకు రక్షణ కరువు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథానికి ఈవో దాసరి శ్రీరామవర ప్రసాద్ స్పందించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన చెరువు స్థలం కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన నరేష్ స్థలం మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమికి మండల సర్వేయర్ హద్దులు చూపిన మేరకు దేవస్థానం ఆధ్వర్యంలో దిమ్మెలు ఏర్పాటు చేశారు.

ముడా కార్యక్రమాలకు సహకరించాలి

• వేదవ్యాస్‌ను కోరిన చైర్మన్ మట్టా ప్రసాద్



మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముడా కార్యక్రమాల్లో తనకు సలహాలు ఇచ్చి సహకరించాలని ముడా మాజీ చైర్మన్, మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌ను ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ కోరారు. వేదవ్యాస్‌ను ముడా చైర్మన్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కాగా, వేదవ్యాస్ ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో బూరగడ్డ వేదవ్యాస్‌ను మట్టా ప్రసాద్ కలిశారు.

క్రీడా సామాగ్రి వితరణ

నాగాయలంక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి కొనుగోలు నిమిత్తం మునిపల్లి శ్రీధర్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు - సంపూర్ణమ్మ ఏడు వేల రూపాయలను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, కె.పూర్ణచంద్రరావు, గాజుల లక్ష్మీ ప్రసాద్‌లకు ఆ మొత్తాన్ని అందజేశారు.

వెల్‌నెస్ కోసం తీసిన గొయ్యి పూడ్చివేత

ఘంటసాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగురావుపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా వెల్‌నెస్ కేంద్రానికి తీసిన పునాదులు నీరు వచ్చి చెరువులా మారి ప్రమాదకరంగా తయార య్యాయి. చాలా లోతుగా ఉండటం వల్ల ప్రజలకు సమస్యలు రాకుండా గుత్తికొండ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గుత్తికొండ కల్యాణ్, గుత్తికొండ రవిబాబు గోతులను పూర్తిగా పూడ్చివేశారు. గుత్తికొండ సోదరులకు గ్రామస్థులు, గ్రామసర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

జ్యోతీరావు పూలే ఆశయాలను నెరవేర్చాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బలహీనవర్గాలను చైతన్యపరుస్తూ జ్యోతీరావుపూలే ఆశయాలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా నాయకుడు మోదుమూడి రామారావు అన్నారు. సీపీఐ కార్యాలయంలో గురువారం జ్యోతీరావుపూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. జ్యోతీరావుపూలే చిత్రపటానికి మోదుమూడి రామారావు, వడుగు రత్నకుమారి, మోదుమూడి నాగరాజు, యర్రంశెట్టి ఈశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దుప్పట్ల పంపిణీ

అవనిగడ్డ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ శివారు తిప్పపాలెంలో షాలేము చర్చి లో వృద్ధులకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు దుప్పట్లు అందజేశారు. విలియమ్ కేరీ, సుకుమార్ పాల్గొన్నారు.